నమస్తే తెలంగాణ
ములుగు
జయశంకర్ భూపాలపల్లి
5 | వరంగల్, బుధవారం 18 సెప్టెంబర్ 2024 | MULUGU JAYASHANKAR BHUPALPALLY



నర్సంపేటలో తెలంగాణ తల్లి విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

# అవమానంపై ఆగ్రహం
# అమ్మకు అభిషేకం

## ఉమ్మడి జిల్లాలో తెలంగాణ తల్లికి క్షీరాభిషేకాలు

సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ తీరుపై బీఆర్ఎస్ శ్రేణులు, తెలంగాణ వాదులు భగ్గుమన్నారు. రాష్ట్ర సచివాలయం, అమర జ్యోతి మధ్యలో తెలంగాణకు సంబంధం లేని రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటు చేశారని మండిపడ్డారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ఉమ్మడి వరంగల్‌లో మంగళవారం తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి పాలాభిషేకాలు నిర్వహించారు.



రాయపర్తి: శివరామపురంలో తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నేతలు

- సీఎం రేవంత్‌రెడ్డిపై మండిపడ్డ గులాబీ శ్రేణులు
- సచివాలయం వద్ద రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటుపై మండిపాటు

నమస్తే నెట్‌వర్క్, సెప్టెంబర్ 17: హనుమకొండ బాల సముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేక కార్యక్రమానికి కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ రాబో యే రోజుల్లో అక్కడ తెలంగాణ తల్లి విగ్రహాన్ని కచ్చితంగా ప్రతిష్టించి తీరుతామని అన్నారు. పరకాల బస్టాండ్ సెంటర్‌లో, హసన్‌పర్తి మండలంలోని జయగిరి, సీతంపేట 65 డివిజన్ చింతగట్టులో, వరంగల్ జిల్లా రాయ పర్తి మండలంలోని శివరామపురం, నర్సంపేట, చెన్నారావుపేట, నెక్కొండ, పర్వతగిరిలో బీఆర్ఎస్ నేతలు తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించా రు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఉద్యమకారుల ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. తొర్రూరు, పెద్దవంగర, జనగామ జిల్లాలో పాలకుర్తి, స్టేషన్‌ఘన్‌పూర్, రఘునాథపల్లి, దేవరుప్పుల, కొడకండ్ల, భూపాలపల్లి జిల్లా గణపురం, ములుగు జిల్లా ఏటూరునాగారం తదితర మండల కేంద్రాల్లో గులాబీ శ్రేణులు ప్రభుత్వ తీరుపై నిరసన వ్యక్తం చేశాయి.



హనుమకొండ బీఆర్ఎస్ కార్యాలయంలో తెలంగాణ తల్లికి పాలాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నేత పులి రజనీకాంత్



హనుమకొండ బీఆర్ఎస్ కార్యాలయంలో తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న మర్రి యాదవరెడ్డి బీఆర్ఎస్ నేతలు

### చారిత్రక ఉద్యమాలను చెరిపేస్తున్న కాంగ్రెస్

**ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు**

మహబూబాబాద్ రూరల్ : ఉద్యమకారుల చరిత్రను లేకుండా చేసే విధానాలను కాంగ్రెస్ పార్టీ మానుకోకపోతే ప్రజలు గుణపాఠం చెప్పడం ఖాయమని ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు అన్నారు. హైదరాబాద్ సెక్రటేరియెట్ ఒక చరిత్రాత్మక ప్రదేశమని, అక్కడ రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటుపై యావత్ ప్రజానీకం, మేధావులు సీఎం రేవంత్‌రెడ్డిని అసహ్యించుకుంటున్నారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో అనేక మంది అసువులు బాసారని, వారి చరిత్రను విస్మరించేలా కాంగ్రెస్ పార్టీ చేస్తుందన్నారు. దీనిని ప్రతి ఒక్కరూ ఖండిస్తున్నారన్నారు. ఇప్పటికైనా అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి జరిగేలా సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశ పెట్టాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్ రెడ్డి, మార్నేని వెంకన్న, పర్కాల శ్రీనివాస్ రెడ్డి, వెంకన్న రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మానుకోటలో తెలంగాణ తల్లికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి




తొర్రూరు ఆర్టీసీ బస్టాండ్ ఎదుట ఉన్న తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



స్టేషన్‌ఘన్‌పూర్‌లో నిరసనలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య



పాలకుర్తి: దర్దేపల్లిలో తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న గులాబీ శ్రేణులు

# నాలాల కబ్జాపై ఉక్కుపాదం

- విద్య, వైద్యానికి ప్రాధాన్యం
- ఎంజీఎంలో మందుల కొరత ఉండొద్దు
- వరంగల్ నగరాభివృద్ధిపై సీఎం ప్రత్యేక దృష్టి
- అక్టోబర్ 2న సీఎం చేతుల మీదుగా కాళోజీ కళాక్షేత్రం ప్రారంభం
- ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రజాపాలన దినోత్సవం



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి , పక్కన మంత్రి సురేఖ, ఎంపీ కావ్య తదితరులు




జెండాకు సెల్యూట్ చేస్తున్న మంత్రి కొండా సురేఖ, కలెక్టర్, సీపీ

హనుమకొండ/వరంగల్ చౌరస్తా, సెప్టెంబర్ 17 : వరంగల్ నగరంలో నాలాలు, ప్రభుత్వ భూముల కబ్జాలపై ఉక్కుపాదం మోపనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రజాపాలన దినోత్సవంలో భాగంగా మంగళవారం వరంగల్, హనుమకొండ కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వరంగల్‌లో కలెక్టర్ సత్యశారద, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుతో కలిసి ఖిలా వరంగల్‌లోని అమరుల స్తూపానికి నివాళులర్పించి, సభావేదికకు చేరుకొని జాతీయ జెండాను ఆవిష్కరించి, పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. హనుమకొండ కలెక్టరేట్‌లో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధిపై మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు, బల్దియా కమిషనర్‌తో కలిసి సమీక్షించారు. ఆయాచోట్ల మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ఆరు గ్యారెంటీల్లో రెండు గ్యారెంటీలను అమలుచేశామని, 500కు గ్యాస్ సిలిండర్ పథకం 39.5లక్షల మందితో ప్రారంభమై ప్రస్తుతం 43లక్షల మందితో నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందన్నారు. గృహజ్యోతి పథకం ద్వారా 48.62 లక్షల మంది లబ్ధిపొందుతున్నారని చెప్పారు. ప్రతి నియోజకవర్గంలో 3500 ఇండ్ల చొప్పున ప్రతి ఆర్థిక సంవత్సరంలో 4లక్షల 50వేల ఇండ్ల నిర్మాణం లక్ష్యంగా పెట్టుకున్నామని పేర్కొన్నారు. ఇంటి నిర్మించుకునే పేదలకు రూ.5లక్షలు ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. వరద బాధిత కుటుంబాలకు రూ.16,500, పంట నష్టం జరిగిన ప్రతి ఎకరాకు రూ.10వేల పరిహారం అందిస్తామని, ఇళ్లు కోల్పోయిన వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పారు. ములుగు, నర్సంపేట మెడికల్ కళాశాలలకు మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అనుమతి లభించిందని తద్వారా మరిన్ని మెడికల్ సీట్లు అందుబాటులోకి వచ్చాయన్నారు.

**వరంగల్ అభివృద్ధికి మాస్టర్‌ప్లాన్**

తెలంగాణలో రెండో అతిపెద్ద నగరంగా ఉన్న వరంగల్‌ను 2050 సంవత్సరానికి అనుగుణంగా మాస్టర్‌ప్లాన్ రూపొందిస్తామని, నాలాల విస్తరణకు చర్యలు చేపట్టి డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్‌లను బలోపేతం చేస్తామని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత రెండో పెద్ద నగరమైన వరంగల్ నగరాభివృద్ధిపై సీఎం ప్రత్యేక దృష్టి సారించారని, అందుకే తనకు ఇన్‌చార్జి మంత్రి బాధ్యతలు అప్పగించారని చెప్పారు. స్మార్ట్‌సిటీ నిధులు విడుదలయ్యేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఆధునిక శాస్త్ర సాంకేతికతతో వరంగల్ మోడల్ బస్‌స్టేషన్‌ను నిర్మిస్తామని తెలిపారు.

**కబ్జా చేసే ఎంతటి వారైనా ఊరుకోం**

నాలాలు, చెరువుల్లో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల పరిధిలో ఇంటి నిర్మాణాలు చేపట్టిన వారి జాబితా సిద్ధం చేయాలని అధికారులను మంత్రి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. ఎంతటి వారైనా సరే తొలగిస్తామన్నారు. బీపీఎల్ కుటుంబాలుంటే వారికి ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తామని చెప్పారు. పేదలను ఇబ్బందులు పెట్టమని బడాబాబులను వదిలిపెట్టేది లేదని, చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రభుత్వానికి రెండు కళ్లలాంటి విద్య, వైద్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు.

**ఎంజీఎంలో మందుల కొరతపై సీరియస్**

పేదలకు పెద్దదిక్కైన వరంగల్ ఎంజీఎంలో మందుల కొరతపై మంత్రి సీరియస్ అయ్యారు. పేషెంట్లు బయటకు వెళ్లి ప్రైవేట్ మెడికల్ షాపుల్లో కొనడమేమిటని ఆగ్రహం వ్యకంచేసిన ఆయన కొరత లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. పేదలకు వైద్యం అందించే విషయంలో నిర్లక్ష్యం చేయవద్దని చెప్పారు. ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు పొరుగు ఉన్న ఛత్తీస్‌గఢ్ నుంచి వైద్యం కోసం పేదలు వస్తుంటారని, సాకులు చెప్పకుండా అన్ని రకాల మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఎంజీఎం దవాఖానను రెగ్యులర్‌గా సందర్శించి వైద్యం కోసం వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలన్నారు. దవాఖానలో ఫిర్యాదులను స్వీకరించి నివేదిక ఇవ్వాలని కలెక్టర్‌ను ఆదేశించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరద ముప్పు నుంచి ప్రజలను రక్షించిన హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు, అధికారులను మంత్రి అభినందించారు. పాత్రికేయులకు తప్పకుండా ఇంటి స్థలాలు ఇస్తామని అర్హుల జాబితాను ఆయా కమిటీలు అందిస్తే స్థలాలు కేటాయించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఆయా యూనియన్లు ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డితో చర్చించాలని సూచించారు.

**అక్టోబర్ 2న కాళోజీ కళాక్షేత్రం ప్రారంభం**

కాళోజీ కళాక్షేత్రాన్ని వచ్చే నెల 2న సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నట్లు మంత్రి తెలిపారు. ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్డు, కాజీపేట ఆర్‌వోబీ పనులకు పూర్తి చేయాలన్నారు. అలాగే వరంగల్ విమానాశ్రయం విషయమై ఆర్అండ్‌బీ మంత్రితో చర్చించనున్నట్లు తెలిపారు. డంపింగ్ యార్డ్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లు, బల్దియా కమిషనర్‌ను ఆదేశించారు.

**సమష్టిగా నగర అభివృద్ధి : మంత్రి సురేఖ**

వరంగల్ నగరంపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. ఈమేరకు అధికారులు నగరాభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలన్నారు. ఎంజీఎం దవాఖానలో సమస్యలను త్వరలోనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పార్కు స్థలాలు చాలా చోట్ల కబ్జాకు గురయ్యాయని ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వరంగల్ ఎంజీఎం అభివృద్ధికి, వసతుల కల్పనకు ప్రత్యేక చొరవ తీసుకోవాలని మంత్రిని కోరారు. వరంగల్ ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ కేంద్రం నుంచి వరంగల్ అభివృద్ధికి నిధులను తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని చెప్పారు. ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, దొంతి మాధవరెడ్డి, మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారద, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, అదనపు కలెక్టర్లు వెంకట్‌రెడ్డి, సంధ్యారాణి, ఆర్‌డీవో వెంకటేశ్, కుడా పీవో అజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

### మెరుగైన వైద్యసేవలందిస్తాం.. ఎస్‌డీపీ, డయాలసిస్ కేంద్రాలను ప్రారంభించిన మంత్రి

వరంగల్ చౌరస్తా : ఎంజీఎంలో మరింత మెరుగైన వైద్యసేవలు అందించడానికి కృషి చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంత్రి కొండా సురేఖతో కలిసి ఆయన ఎంజీఎం బ్లడ్ బ్యాంకులో కేంద్ర ప్రభుత్వం అందించిన సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్స్ కలెక్షన్ మిషన్‌ని ఆయన ప్రారంభించారు. వైరల్ ఫీవర్స్, డెంగ్యూ లాంటి ప్రాణాంతక పరిస్థితులు ఏర్పడినప్పుడు అవసరమయ్యే వైద్యసేవల్లో సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్స్ ఎంతో ముఖ్యపాత్ర పోషిస్తాయని, ప్రైవేట్ హాస్పిటల్స్‌లో రూ.12వేల ఖర్చయ్యే ఈ వైద్యసేవలను ఎంజీఎంలో ఉచితంగా అందుబాటులో ఉంటుందన్నారు. ఆ తర్వాత ఓపీ విభాగంతో పాటుగా ఆరోగ్యశ్రీ వా ర్డు, మెడికల్ వార్డులతోపాటు డైట్ కిచెన్‌లను పరిశీలించారు. ఎంజీఎంలో అందుతున్న సేవలను గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. పిల్లల విభాగంలో మందులు అందుబాటులో లేవని అటెండెంట్ రాజు మంత్రి దృష్టికి తీసుకువెళ్లడంతో వెంటనే పరిశీలించి అన్ని రకాల మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులను ఆశించారు. పిల్లల వార్డులో చికిత్స పొందుతున్న చిన్నారులకు అందుతున్న వైద్యసేవలను ఆరా తీయాలని ఎంపీ కావ్యను కోరారు. అనంతరం కేఎంసీలోని నెఫ్రాలజీ విభాగంలో డయాలసిస్ సెంటర్ మంత్రి సురేఖ, ఎంపీ కావ్య, ఎమ్మెల్యే నాయినితో కలిసి ప్రారంభించారు. ప్రస్తుత అవసరాలను దృష్ట్యా మరో 10 డయాలసిస్ యూనిట్లు మంజూరు చేస్తున్నట్లు మంత్రి పొంగులేటి ప్రకటించారు. అనంతరం అంతర్గత రోడ్లకు శంకుస్థాపన చేశారు.

# కాంగ్రెస్‌లో భగ్గుమన్న వర్గపోరు

- జనగామలో ప్రజాపాలన వేదికపై డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి
- ఏ హోదాలో కూర్చోబెట్టారంటూ వ్యతిరేకవర్గం నేతల నిరసన.. రెండువర్గాల నేతల మధ్య వాగ్వాదం
- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సాక్షిగా పార్టీలో రచ్చకెక్కిన గ్రూపు విభేదాలు



ప్రజాపాలన వేదికపై ఏ హోదాలో కూర్చున్నావంటూ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని నిలదీస్తున్న అసమ్మతి వర్గం నాయకులు

జనగామ, సెప్టెంబర్ 17(నమస్తే తెలంగాణ): జనగామలో కాంగ్రెస్ వర్గపోరు బహిర్గత మైంది. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి సొంత పార్టీ నుంచే నిరసన సెగ తాకింది. ఆయన వ్యతిరేక వర్గం ప్రతి రోజూ తమ అసమ్మతి, అసహనా న్ని వెల్లగక్కుతున్నారు. తాజాగా మంగళవారం ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సమక్షంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు రెండు గ్రూపులుగా విడిపోయి దూషించుకున్నారు. కలెక్ట రేట్‌లో ప్రజాపాలన దినోత్సవ వేడుకల్లో ప్రభుత్వ విప్ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభా వేదికపైకి అధికారులు ఐలయ్యను ఆహ్వానించగా ఆయన వెంటే కొమ్మూరి కూడా వెళ్లి కూర్చున్నారు.


దీంతో కొమ్మూరి వ్యతిరేక వర్గం నాయకులైన మున్సిపల్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎర్రమల్ల సుధాకర్, డీసీసీ మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ లింగాజీ, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కంచ రాములు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో కలెక్టర్ రిజ్వాన్, అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్, వెస్ట్‌జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్ జోక్యం చేసుకొని కిందకు వెళ్లి కూర్చోవాలంటూ కొమ్మూరికి నచ్చజెప్పారు. చేసేదేమీలేక కిం దకు దిగాల్సి వచ్చింది. ఆ తర్వాత రెండు వర్గాల కాంగ్రెస్ నాయకులు 'నువ్వెంతంటే నువ్వెంత', 'మీ లాంటి వారి వల్లే పార్టీ కాంగ్రెస్ సర్వనాశనమవుతున్నది' అంటూ ఒకరినొకరు పరస్పరం దూషించుకున్నారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ప్రజా పాలన పేరిట ప్రజలకు మెరుగైన సేవలందించాల్సిన అధికార పార్టీ నాయకులు ఇలా బహిరంగంగా ఒకవర్గంపై మరొకరు దూషణలకు దిగడం చూసి ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

**ఇక్కడ బ్రేక్‌ఫాస్ట్..అక్కడ లంచ్..**

ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఉదయం కొమ్మూరి వ్యతిరేక వర్గం నాయకుడు మున్సిపల్ మాజీ చైర్మన్ వేమళ్ల సత్యనారాయణరెడ్డి ఇంటికి వెళ్లి బ్రేక్ ఫాస్ట్ చేసి, ఆ తర్వాత ప్రతాప్‌రెడ్డి ఇంటికి వెళ్లడం వర్గపోరును మరింత రాజేసింది. అంతేకాకుండా ఐలయ్యకు స్వాగతం పలుకుతూ కొమ్మూరి ఫొటో లేకుండా ఆయన వ్యతిరేక వర్గం నాయకుల పేరిట పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు వెలిశాయి. డీసీసీ అధ్యక్షుడు, పార్టీ సీనియర్ నాయకులకు మధ్య గ్యాప్ పెరిగి రెండు గ్రూపులు విడిపోయి వ్యతిరేక వర్గం నాయ కులంతా భువనగిరి ఎంపీ కిరణ్ కుమార్‌రెడ్డితో సఖ్యతగా మెలగడం గమనార్హం.

# మరో మూడు కంటెయినర్ స్కూళ్లు

**పాఠశాల ప్రారంభోత్సవంలో మంత్రి సీతక్క**



బంగారుపల్లి కంటెయినర్ పాఠశాలను ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క, ఎంపీ బలరాంనాయక్

కన్నాయిగూడెం, సెప్టెంబర్ 17 : బంగారుపల్లి తరహాలో మరో మూడు చోట్ల కంటెయినర్ స్కూళ్లను ఏర్పాటుచేయనున్నట్లు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. బంగారుపల్లిలోని గొత్తికోయగూడెంలో రూ.13.50 లక్షలతో ఏర్పాటుచేసిన రాష్ట్రంలోనే మొదటి కంటెయినర్ పాఠశాలను మంగళవారం ఎంపీ బలరాంనాయక్, టీచర్స్ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, కలెక్టర్ దివాకర్‌తో కలిసి ఆమె ప్రారంభించారు. నిర్మాణాలకు వీలు లేకుండా అటవీ శాఖ నిబంధనలు ఉండడం వల్ల ఇలా ఏర్పాటు చేశామని చెప్పారు. గిరిజనుల పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు ఈ పాఠశాల ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా ములుగు కలెక్టరేట్‌లో నిర్వహించిన వేడుకల్లో మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్డీవో సత్యపాల్ రెడ్డి, డీఈవో పాణిని, మండల ప్రత్యేక అధికారి వెంకటనారాయణ, ఓఎస్డీ మహేశ్‌బాబా సాహెబ్ గీతె, ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, పంచాయతీరాజ్ ఈఈ అజయ్‌కుమార్, ఎంపీడీవో అనిత, తహసీల్దార్ సలీం పాల్గొన్నారు.